వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 8
శుక్రవారం, డిసెంబరు 5, 2025
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## సెంటిమెంట్ రగిల్చి లబ్ధి పొందేందుకు యత్నిస్తోన్న బిఆర్ఎస్

### టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, డిసెంబర్ 4, (వాయిస్ టుడే):** సెంటిమెంట్ రగిల్చి లబ్ధి పొందేందుకు బిఆర్ఎస్ యత్నిస్తోందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. హిల్ట్ పాలసీ ద్వారా భూముల ధరలు తగ్గుతాయని, సామాన్యులకు భూముల ధరలు అందుబాటులో వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొణిజేటి రోశయ్య, ఎస్పి బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదని, ఈ దేశానికి వారు సంపద అని కొనియాడారు. ఎస్పి బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్రభారతిలో ఉంటే తప్పేంటి? అని మహేష్ ప్రశ్నించారు. బిజెపి కోసమే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని, కాలుష్యరహితంగా హైదరాబాద్ మారుతుందని తెలియజేశారు. అవినీతికి అలవాటు పడిన మాజీ సిఎం కెసిఆర్ కుటుంబానికి తమ ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అంటూ విమర్శించడం అలవాటుగా మారిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



# తెలంగాణలో అదిలాబాద్‌ను అగ్ర స్థానంలో నిలబెడతాం

## ఎన్నికల కోడ్ ముగియగానే 40 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపడతాం

### ఆదిలాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

**అదిలాబాద్, డిసెంబర్ 4, (వాయిస్ టుడే):** తెలంగాణలోని వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పలు కీలక హామీలను ఇచ్చారు. అభివృద్ధి చెందిన జిల్లాగా తెలంగాణలో అగ్రస్థానంలో నిలబెట్టే విధంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి గారు ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో మాట్లాడుతూ, ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు, చనాక - కొరాట ప్రాజెక్టు, విమానాశ్రయం, విశ్వవిద్యాలయం ఏర్పాటు, సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం వంటి కీలకమైన ప్రాజెక్టులపై స్పష్టమైన ప్రకటన చేశారు. తుమ్మిడిహట్టి వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టి ఈ జిల్లా పంట పొలాలకు నీళ్లిస్తామన్నారు. త్వరలోనే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి ఆదిలాబాద్ జిల్లాకు విశ్వవిద్యాలయం మంజూరు చేస్తామని ప్రకటించారు. జిల్లాకు విశ్వవిద్యాలయం మంజూరు చేస్తామని, దాన్ని ఎక్కడ పెట్టాలన్నది స్థలం ఎంపికను ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు చర్చించి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ఆ వర్సిటీని ఇంద్రవెల్లిలో పెట్టడమే కాకుండా దానికి కొమురం భీం విశ్వవిద్యాలయంగా నామకరణం చేస్తే మరింత బాగుంటుందని సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం తిరిగే లోపు 61 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేశాం. ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ సంబరాలు ముగిన తర్వాత సమీక్ష నిర్వహించి మరో 40 వేల ఉద్యోగాల నియామకాల ప్రక్రియ చేపడుతాం. మొత్తంగా లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు.

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి**

ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో రూ. 260.45 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి తో పాటు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.18.70 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల సమగ్ర అభివృద్ధి పనులు. .1.75 కోట్ల పెట్టుబడితో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాలతో పెట్రోల్ బంక్ స్థాపన, రూ.19.69 కోట్లుతో 160 స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు, రూ.200 కోట్లతో పట్టణ పరిధిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ (YIIRS) కాంప్లెక్స్ నిర్మాణం, 2 కోట్లతో మహాలక్ష్మివాడ, విద్యానగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, ఆధునికీకరణ, శాంతి భద్రతలకు ప్రాధాన్యతనిస్తూ పోలీసు మౌలిక సదుపాయాల కల్పన కోసం పట్టణంలోని సంజయ్ నగర్ ప్రాంతంలో రూ.11.93 కోట్లతో 18 పోలీస్ క్వార్టర్స్, రూ. 2.6 కోట్లతో 3 ఇంటెలిజెన్స్ విభాగానికి క్వార్టర్స్, రూ. 2 కోట్లతో భరోసా కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.

# రైజింగ్ సమ్మిట్‌పై ఆశలు



**హైదరాబాద్, డిసెంబర్ 4, (వాయిస్ టుడే):** తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో కీలక ఆర్థిక కేంద్రంగా నిలబెట్టాలనే సుదూర లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కు అంకురార్పణ చేస్తోంది. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని 'ఫ్యూచర్ సిటీ'లో నిర్వహించడానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ సమ్మిట్‌ను కేవలం పెట్టుబడుల సమావేశంగా కాకుండా, రాబోయే రెండు దశాబ్దాల తెలంగాణ ప్రగతి ఆవిష్కరణ వేదికగా చెప్పవచ్చు.

**విజన్ డాక్యుమెంట్**

తెలంగాణ రైజింగ్–2047తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ముఖ్య కేంద్ర బిందువు తెలంగాణ రైజింగ్ –2047 విజన్ డాక్యుమెంట్. 2047 నాటికి మన దేశం స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనుంది. ఈ ఉత్సవాల నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని %వి3వి% ట్రిలియన్ డాలర్ల (%వి250వి% లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న రోడ్ మ్యాప్ తెలంగాణ రైజింగ్ –2047 విజన్ డాక్యుమెంట్లో ఉంది. దీని ద్వారా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దీర్ఘకాలిక పునాదిని పటిష్టంగా వేయాలన్న యోచనతో ఈ కార్యక్రమానికి

- మిగతా 2వ పేజీలో



## వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తే పదవి ఖాయం

**హైదరాబాద్, డిసెంబర్ 4, (వాయిస్ టుడే):** డీసీసీల నియామకం అయిపోయింది. పార్టీ పదవులు ఒక్కొక్కటిగా భర్తీ అయిపోతున్నాయ్. ఇక పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు మాత్రమే మిగిలాయి. హెవీ కాంపిటీషన్ ఉండటంతో..వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకాన్ని ఇన్నాళ్లు హోల్డ్ లో పెట్టారు. ఆల్ ఆఫ్ సడెన్ గా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన హింట్ తో రేసు మొదలైందట. వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు కోసం లాబీయింగ్ స్టార్ట్ చేశారట లీడర్లు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేసులో ఉన్నదెవరు? ఛాన్స్ దక్కే నేతలెవరు?తెలంగాణ కాంగ్రెస్ లో మరోసారి పదవుల పందేరం మొదలైంది. వరుసగా ఒక్కొక్కటిగా పార్టీ పదవులను

2లో



## సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో..

### గడిచిన రెండు రోజుల వ్యవధిలోనే వందలాది విమానాల రద్దు

**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 4, (వాయిస్ టుడే):** దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతున్నది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. నవంబర్‌లో ఏకంగా 1,232 సర్వీసులను రద్దు చేసినట్లు డీజీసీఏ బుధవారం ప్రకటించింది. అంతేకాదు, కేవలం గడిచిన రెండు రోజుల వ్యవధిలోనే వందలాది విమానాలను సంస్థ రద్దు చేసింది. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ సహా ఇతర పట్టణాలకు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో సంక్షోభం తలెత్తింది.సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టులలో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. గత రెండు రోజుల్లోనే ఏకంగా 250 నుంచి 300 విమానాలను సంస్థ రద్దు చేసింది. ఈ కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో సంక్షోభం ఏర్పడింది. ఫ్లైట్స్ రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయి దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఎయిర్‌పోర్ట్స్ వద్ద భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. విమానాలు రద్దు కావడంతో ప్రముఖ ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కోరింది.అదే సమయంలో తాజా పరిస్థితిపై ప్రయాణికులు నిరాశను వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో విమానాశ్రయాలలో ప్రయాణికులు ఆగ్రహంతో సిబ్బందిని నిలదీస్తున్న

- మిగతా 2వ పేజీలో

## అనుముల రేవంత్ రెడ్డి కాదు.. అవినీతి అనకొండ: కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 4, (వాయిస్ టుడే):** హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర




- మిగతా 2వ పేజీలో

## చంపేస్తున్న చలి...

**అదిలాబాద్, డిసెంబర్ 4, (వాయిస్ టుడే):** చలి తీవ్రత అధికం కావడంతో దేశంలోని అనేక ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత ఊహించిన దాని కంటే అధికంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు.తెలంగాణ, ఉత్తర కర్ణాటకతో పాటు మధ్య, వాయవ్య, పశ్చిమ, తూర్పు భారతంలోని పలు ప్రాంతాల్లో రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనుంది. ఈ నెల నుంచి ఫిబ్రవరి వరకు ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయన్న వివరాలపై భారత వాతావరణ శాఖ ఐఎండీ ఓ రిపోర్టు రిలీజ్ చేసింది. ఆయా ప్రాంతాల్లో పగలతో పాటు రాత్రి



- మిగతా 2వ పేజీలో

## రాజకీయాలకు రజనీ గుడ్ బై

**గుంటూరు, డిసెంబర్ 4, (వాయిస్ టుడే):** జగన్మోహన్ రెడ్డి మంత్రి పదవి ఇచ్చేసరికి విడదల రజిని పొంగిపోయారు. జీవితాంతం రుణపడి ఉంటానని కూడా చెప్పుకొచ్చారు. అయితే జగన్ ఇప్పుడు ఆమెను నియోజకవర్గాల చుట్టూ తిప్పుతున్నారు. అయితే తిరిగి తిరిగి ఆమె ఇప్పుడు విసిగిపోతున్నారు. ఇక నియోజకవర్గం అంటూ జగన్మోహన్ రెడ్డికి చేతులెత్తి దండం పెడుతున్నారు. అదేంటి మంత్రిగా ఇచ్చేటప్పుడు రుణం తీర్చుకోలేనిది అన్నారు కదా.. అందుకే ఫలానా నియోజకవర్గానికి వెళ్లాల్సిందేనని జగన్మోహన్



- మిగతా 2వ పేజీలో

## అనుముల రేవంత్ రెడ్డి కాదు..
# అవినీతి అనకొండ: కేటీఆర్



(మొదటి పేజీ తరువాయి)

లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. అనుముల రేవంత్ రెడ్డి కాదని, అవినీతి అనకొండ అని విమర్శించారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు.రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతున్నదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీడిమెట్ల ప్రాంతంలో గజానికి మార్కెట్ ధర లక్ష రూపాయలుగా ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కే భూమిని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతున్నదని విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి ఇది నిదర్శనమన్నారు. భూముల దోపిడీ ఆర్నెళ్లుగా జరుగుతున్నదని, పాలసీ ఇప్పుడు బయటకు వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవలన్నారు.

# సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో..

(మొదటి పేజీ తరువాయి)

దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ప్రధాని నరేంద్ర మోదీ, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును ట్యాగ్ చేస్తూ పలువురు నెటిజన్లు ఎక్స్ వేదికగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 7 గంటలకు పైగా చిక్కుకుపోయిన ఓ ప్రయాణికుడు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తీవ్ర గందరగోళం తలెత్తినట్లు ఎక్స్‌లో పేర్కొన్నాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు 12 గంటలకు పైగా ఎటువంటి కన్ఫర్మేషన్ లేకుండా పడిగాపులు పడుతున్నారని, ఇండిగో సిబ్బంది అబద్ధాలు చెబుతూ జలగల్లా పీడిస్తున్నారని విమర్శించారు.

### 48 గంటల్లో సాధారణ స్థితికి..

మరోవైపు విమానాల రద్దు, ఆలస్యంపై ఇండిగో సంస్థ స్పందించింది. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపింది. క్రమంగా తమ విమానాలు పునరుద్ధరించనున్నామని వెల్లడించింది. విమానాల రద్దు కారణంగా ప్రభావితమైన ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. 48 గంటల్లో తమ కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయని తెలిపింది. ఈ మేరకు గురువారం ఉదయం ప్రకటన విడుదల చేసింది.

### ఇండిగో విమానాల రద్దుపై దర్యాప్తు: డీజీసీఏ

ఇండిగో ఎయిర్‌లైన్స్ పనితీరును డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) బుధవారం ప్రశ్నించింది. నవంబర్‌లో 1,232 విమానాలు రద్దవడంతోపాటు విమానాల రాకపోకల సమయాల్లో జాప్యం జరిగింది. ఈ పరిస్థితిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీజీసీఏ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు జరుగుతున్న అసౌకర్యాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు చేపట్టవలసిన చర్యల గురించి ఇండిగోతో కలిసి మదింపు చేస్తున్నట్లు తెలిపింది.

# చంపేస్తున్న చలి...

(మొదటి పేజీ తరువాయి)



ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా రికార్డు అవుతాయని చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో పగటితో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంత కంటే అధికంగా రికార్డు అవుతాయని పేర్కొంది. ఈ నెల దక్షిణాదిన సాధారణం లేదా అంతకంటే అధికంగా వర్షపాతం రికార్డు అవుతుందని చెప్పింది. ఉత్తర కోస్తాలో సాధారణం కంటే అధికంగా, ఏపీలోని మిగతా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం రికార్డు అవుతుందని తెలిపింది. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఇప్పటికే వాతావరణం చల్లబడింది. దానితో పాటు లా నినా ప్రభావంతో చలి గాలులు పెరుగుతాయని ఐఎండీ చెప్పింది. చలి పెరగడంతో వృద్ధులు, చిన్నారులతో పాటు గుడిసెల్లో నివసించే సంచార జాతుల వారు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపింది.




# రైజింగ్ సమ్మిట్‌పై ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకారం చుట్టారు.

### 1. ప్రపంచ పెట్టుబడుల ఆకర్షణ – ఉద్యోగ కల్పన

తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలను, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి, పెట్టుబడులు పెట్టేందుకు పురికొల్పడమే ఈ సమ్మిట్ ముఖ్య ఉద్దేశం. ముఖ్యంగా, తయారీ, ఐటీ/టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, మరియు ఎలక్ట్రిక్ వాహనాలు వంటి రంగాలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఈ రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడం ధ్యేయంగా పెట్టుబడుల ఆకర్షణ చేపట్టనున్నారు. దీని ప్రభావం విషయానికి వస్తే, దిగ్గజ కంపెనీలు, పారిశ్రామికవేత్తల పెట్టుబడుల ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వేగంగా వృద్ధి చేయడం ఒక అంశంగా చెప్పవచ్చు. ఇంకో అంశం ఏమిటంటే, తెలంగాణ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు సృష్టించడం, అందులోనూ అత్యున్నత వేతన ఉద్యోగావకాశాలు కల్పించడం. దీనివల్ల రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గిపోవడమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

### 2. తెలంగాణకు గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్ – నమ్మకమైన గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రం

ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ – 2025 ద్వారా తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెంచడం తెలంగాణ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన, నమ్మకమైన పెట్టుబడి గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. భారతదేశంలోనే 'వ్యాపారం చేయడానికి సులభంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచే పలు సంస్కరణలను ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. తద్వారా తెలంగాణ రాష్ట్రానికి మెరుగైన బ్రాండింగ్, స్థిరమైన ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రవహించడానికి మార్గం సుగమం అవుతుంది.

### 3. తెలంగాణ విజన్ 2047 ఆవిష్కరణ – ఆర్థిక స్వావలంబన

భారతదేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకునే 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా %వి3వి% ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చేందుకు సమగ్ర ఆర్థిక, సామాజిక, మౌలిక సదుపాయాల రోడ్ మ్యాప్‌ను ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈ సమ్మిట్‌కు వచ్చే ప్రపంచ నేతలు, ఆర్థికవేత్తలు, అంతర్జాతీయ మీడియా ముందు తెలంగాణ విజన్ –2047ను ఆవిష్కరించడం ద్వారా కలిగే ప్రభావం విషయానికి వస్తే, అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో విశ్వాసం కలుగుతుంది. ఇది కేవలం ఒక రాష్ట్ర ఆకాంక్షగా కాకుండా, అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు పకడ్బందీ ప్రణాళిక రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉందన్న సంకేతం వెళుతుంది. దీనివల్ల పెట్టుబడిదారులు నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు కుమ్మరిస్తారన్నది ప్రభుత్వ యోచన.

### 4. సమ్మిళిత, సమతుల్య వృద్ధి – అన్ని ప్రాంతాల అభివృద్ధి ప్రణాళిక

ఈ గ్లోబల్ సమ్మిట్‌లో కేవలం హైదరాబాద్‌ను మాత్రమే కాకుండా, రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలైన వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో కూడా ఐటీ, పరిశ్రమలు నెలకొల్పేలా చేయడం. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల వృద్ధిపై అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వం ప్రదర్శించనుంది. దీని ద్వారా ఆర్థిక ఫలాలు కేవలం హైదరాబాద్ వంటి నగరానికి మాత్రమే కాకుండా, అన్ని ప్రాంతాలకు సమంగా అందించాలన్న ఉద్దేశాన్ని ప్రకటించడం. దీనివల్ల ప్రజల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల్లో నమ్మకాన్ని నెలకొల్పడం ద్వారా నగరాలకు, పట్టణాలకు వలసలను నివారించే ప్రయత్నంగా చెప్పవచ్చు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 అనేది రాష్ట్ర భవిష్యత్తుకు టార్చ్ బేరర్ వంటిదని ప్రభుత్వం భావిస్తోంది. ఇది పెట్టుబడులను, ఉద్యోగాలను ఆకర్షించడమే కాక, రాష్ట్రాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రధాన శక్తిగా నిలబెట్టడానికి వేస్తున్న పటిష్టమైన తొలి అడుగుగా అభివర్ణిస్తోంది.

## వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తే
# పదవి ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

భర్తీ చేస్తూ వస్తోంది ఏఐసీసీ. ఈ మధ్య కాలంలో వైస్ ప్రెసిడెంట్లు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ, పొలిటికల్ అడ్వైజరీ కమిటీ, జనరల్ సెక్రటరీలు..లేటెస్ట్ గా డీసీసీ డీసీసీ ప్రెసిడెంట్లను నియమించారు. ఇక ఫైనల్ గా మిగిలింది ఒక్క వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు మాత్రమే. ఈ కీలకమైన పదవుల కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ ఉంది. కీలకమైన నేతల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో ఇన్నాళ్లు హోల్డ్ లో పెట్టారు. అయితే గాంధీభవన్ లో జరిగిన పార్టీ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులను కూడా భర్తీ చేస్తామని చెప్పారు. దీంతో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం నేతలు మరోసారి లాబీయింగ్ స్టార్ట్ చేశారట.కాంగ్రెస్ పార్టీలో పీసీసీ తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు అత్యంత కీలకమైనది. ఈ పోస్టులో గతంలో పని చేసిన వారందరూ ఇప్పుడు కీలకమైన పోస్టుల్లో ఉన్నారు. ప్రస్తుతం సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి కూడా కాంగ్రెస్ లోకి రాగానే వర్కింగ్ ప్రెసిడెంట్ గా పని చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేసిన వారే. ప్రస్తుతం పీసీసీ చీఫ్ గా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ కూడా లాస్ట్ టర్మ్ లో వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేశారు. ఇలా వర్కింగ్ ప్రెసిడెంట్ గా కీలకమైన నేతలే పని చేయడంతో ఇప్పుడు ఈ పోస్ట్ కు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఈ సారి వర్కింగ్ ప్రెసిడెంట్లను సామాజిక వర్గాల వారీగా కీలకమైన వ్యక్తులకు ఛాన్స్ ఇవ్వాలని పార్టీ ఆలోచన చేస్తోంది.వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు కోసం సామాజికవర్గాల వారీగా ఈసారి ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇవ్వాలని పార్టీ ఆలోచన చేస్తోందట. ఒక్కో సామాజిక వర్గం నుంచి ఒక్కరికి ఛాన్స్ ఉండటంతో..పోటీలో మాత్రం చాలా మంది క్యూలో ఉన్నారట. రెడ్డి సామాజికవర్గం నుంచి పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితులు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రోహిన్ రెడ్డితో పాటు వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కూడా రేసులో ఉన్నారట.నాయిని రాజేందర్ రెడ్డికి వైస్ ప్రెసిడెంట్ గా అవకాశం ఇచ్చినా..ఆయన ఆ పోస్టును తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. ఇక ఎంపీ చామల అయితే వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఫైనల్ గా రోహిన్ రెడ్డికి అవకాశం ఇస్తారని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక బీసీ సామాజికవర్గం నుంచి టీఎస్ఎండీసీ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం ప్రయత్నిస్తున్నారట.ఎస్సీ సామాజికవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ లాబీయింగ్ చేస్తున్నారట. ఎస్టీ సామాజికవర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్ రేసులో ఉన్నారని అంటున్నారు. ఎంపీ బలరాం నాయక్ పీసీసీ చీఫ్ పోస్ట్ కోసం ప్రయత్నాలు చేసినా..వర్క్ ఔట్ కాలేదని..దాంతో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట. ఇక ఫైనల్ గా మైనారిటీ కోటాలో ఫిరోజ్ ఖాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఖమ్మం మాజీ డీసీసీ అధ్యక్షుడు జావిద్ రేసులో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ కీలకమైన పోస్టు ఎవరెవరికి దక్కుతుందనేది చూడాలి.




## రాజకీయాలకు
# రజనీ గుడ్ బై

(మొదటి పేజీ తరువాయి)

రెడ్డి తేల్చి చెబుతున్నారు. దీంతో గత కొద్ది రోజులుగా విడదల రజిని కనిపించకుండా మానేశారు. మంత్రి పదవి ఇచ్చిన మాట సరే. కానీ ఈ నియోజకవర్గాల తిప్పుడు ఏంటి అని ప్రశ్నిస్తున్నారు రజిని. పార్టీ పెద్దలకు మొరపెట్టుకుంటున్నారు. ఇలా అయితే కుదరదు అని తేల్చి చెబుతున్నారు.అయితే రజిని వైఖరిలో వైసీపీ శ్రేణులు పెద్దగా మార్పు గమనించడం లేదు. ఎందుకంటే ఆమె మాట తెలుసు వారికి. సైబరాబాద్ మొక్కను సార్ నేను అంటూ చంద్రబాబును నమ్మించారు. అక్కడకు కొద్ది రోజులకే వైసీపీలోకి జంప్ చేశారు. టిడిపిలో ప్లేస్ కల్పించిన ప్రత్తిపాటి పుల్లారావుకే ఝలక్ ఇచ్చారు. పోనీ మంచి నిర్ణయమే తీసుకున్నారు. ఇలా వెళ్లారో లేదో ఎమ్మెల్యే అయ్యారు. అక్కడకు కొద్ది రోజులకే ఈ రాష్ట్రానికి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి అధికారాన్ని చలాయించారు. అయితే ఇంతటి అవకాశం కల్పించిన జగన్మోహన్ రెడ్డి ఆమెను గుంటూరుకు వెళ్ళమని ఆదేశించడమే తరువాయి వెళ్లారు. కానీ ఘోర పరాజయం ఎదురు కావడంతో తన చిలకలూరిపేటకు వచ్చేసారు.అయితే చిలకలూరిపేటలో వద్దు ఈసారి రేపల్లెకు వెళ్ళండి అంటూ రజనీకి ఆదేశాలు ఇచ్చారు జగన్. అయితే మొన్ననే గుంటూరు వెళ్లాను కదా సార్.. రేపల్లె వెళ్లలేను అంటూ సెలవిచ్చారు రజిని. అయితే జగన్మోహన్ రెడ్డి మాటకు ఎదురు చెప్పేసరికి ఆయనకు ఆగ్రహం వచ్చిందట. పోనీ ఏదైనా ఇతర పార్టీలో చేరుదాము అంటే రజనీకి ఆప్షన్ లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంటే రేపల్లె వెళ్లాలి. అక్కడ ఏమంత పరిస్థితి బాగాలేదు. కక్కలేక మింగలేక రజిని సతమతమవుతున్నారు. రేపల్లె వెళ్లడం లేదు.. ఉన్న చిలకలూరిపేటలో కనిపించడం లేదు. ఎందుకు వచ్చింది గొడవ అంటూ మళ్ళీ సైబరాబాద్ నీడకు వెళ్ళిపోయారంటూ సెటైర్లు పడుతున్నాయి. చూడాలి ఆమె రాజకీయ ప్రయాణం ఎలా ఉంటుందో?

# రోజురోజుకు క్షీణిస్తున్న రూపాయి మారకం విలువ

## గురువారం మరో 28 పైసలు కోల్పోయి
## ఆల్‌టైం హైకి 90.43కి పడిపోయిన రూపాయి

## రూపాయి పతనానికి ఆర్బీఐ బ్రేక్ వేసేనా?

**హైదరాబాద్ డిసెంబర్ 4:** రూపాయి మారకం విలువ రోజురోజుకు క్షీణిస్తున్నది. అంతర్జాతీయ మార్కెట్లో యూఎస్ డాలర్‌కు డిమాండ్ నెలకొనడంతో రూపాయి లైఫ్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరింది. ఇప్పటికే 90.15 స్థాయికి పడిపోయిన విలువ గురువారం మరో 28 పైసలు కోల్పోయి ఆల్‌టైం హైకి 90.43కి పడిపోయింది. రూపాయి విలువ పతనం మరికొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం రూ.90.70–91 మార్కును తాకుతుందని పేర్కొన్నారు.కాగా, బుధవారం ఉదయం 89.96 వద్ద ప్రారంభమైన డాలర్–రుపీ ఎక్స్చేంజ్ రేటు ఇంట్రాడేలో 90.30 స్థాయికి పతనమైంది. చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే 19 పైసలు తగ్గి 90.15కి జారుకున్నది. మంగళవారం రూపాయి విలువ 43 పైసలు కోల్పోయి 89.96కి పడిపోయిన విషయం తెలిసిందే. దిగుమతిదారుల నుంచి అమెరికా కరెన్సీకి డిమాండ్ నెలకొనడం రూపాయి పతనానికి ఆజ్యంపోసిందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. ప్రస్తుత సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 5 శాతం పతనం చెందింది.

### రూపాయి పతనానికి ఆర్బీఐ బ్రేక్ వేసేనా?

అంతర్జాతీయంగా అన్ని కరెన్సీలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు గురవుతున్నాయని, ఇదే క్రమంలో రూపాయి పతనం చెందింది తప్పా.. బలహీనమైన కరెన్సీ మాత్రం కాదని ఎస్బీఐ ఎకానమిక్ రీసర్చ్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మరోవైపు, ఈవారంలోనే వడ్డీరేట్ల తగ్గింపుపై రిజర్వు బ్యాంక్ నిర్ణయం తీసుకోనుండటం కూడా రూపాయి పతనానికి బ్రేక్ వేయవచ్చుని వారు అభిప్రాయపడ్డారు. స్వల్పకాలంలో డాలర్–రుపీ ఎక్స్చేంజ్ రేటు 89.90 నుంచి 91.20 మధ్యలో నమోదుకానున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.3,206 కోట్ల షేర్లను విక్రయించడం కూడా రూపాయి పతనానికి ఆజ్యంపోసింది. దేశీయ ఎగుమతులు నీరసించడం, వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్ఠంభన నెలకొనడం విదేశీ పెట్టుబడిదారుల్లో ఆందోళనన నెలకొన్నది.

### ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం

రూపాయి పతనంతో దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. ముఖ్యంగా దిగుమతులపై అత్యధికంగా ఆధారపడుతున్న భారత్‌పై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వారు వెల్లడిస్తున్నారు. చమురు బిల్లుల కోసం అధికంగా వెచ్చించాల్సి రావచ్చునని అంటున్నారు. ముఖ్యంగా దేశీయ వినిమయంలో 80 శాతం దిగుమతులపై ఆధారపడుతున్న భారత్‌కు ఇది పెద్దదెబ్బేనని వారు అంటున్నారు.



# జిల్లాలలో పంచాయతీ ఎన్నికలను నిబంధన ప్రకారం నిర్వహించాలి

### – రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో..( వాయిస్ టుడే ప్రతినిధి ):– జిల్లాలలో పంచాయతీ ఎన్నికలను నిబంధన ప్రకారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాల ప్రకటన నియమాలు, ఏకగ్రీవ స్థానాలలో ఉపసర్పంచ్ ఎన్నిక, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు, నామినేషన్ల పై వచ్చే ఫిర్యాదులు, తదితర అంశాల పట్ల ఎన్నికల కమిషనర్ రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలలో ఉప సర్పంచ్ నియామకం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని అన్నారు. ఏకగ్రీవంగా ఎంపికైన గ్రామ సర్పంచ్ పోస్టులకు ఫారం 10 ప్రకారం ఫలితాల ప్రకటన చేపట్టాలని అన్నారు.

నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత సంబంధిత గ్రామాలలో స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తి చేయాలని అన్నారు. నామినేషన్ల ప్రక్రియ చివరి దశకు చేరుకున్నందున సంబంధిత రిపోర్టులు టి– పోల్ నందు పెండింగ్ లేకుండా నమోదు చేయాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి వచ్చిన నామినేషన్ లలో వాలీడ్ నామినేషన్ వివరాలు అప్ డేట్ చేయాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు పరిశీలించి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని, ప్రతి మండలంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని అన్నారు. బ్యాలెట్ పేపర్ నిబంధనల ప్రకారం ముద్రించాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఎటువంటి ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు జరుగకుండా పక్కా నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ కలెక్టర్ వీరా రెడ్డి, జిల్లా,పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఓవర్ లోడ్‌తో నడిపే వాహనాలు, కాలం చెల్లిన వాహనాలు నడిపి.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చట్టరీత్యా చర్యలు తప్పవు

### – యాదాద్రి భువనగిరి జిల్లా రవాణా శాఖ అధికారి బి. సాయి కృష్ణ



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో...( వాయిస్ టుడే ప్రతినిధి ) :– ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్ తో వచ్చిన వాహనాలను, కాలం చెల్లిన బస్సులు, ఇతరతర వాహనాలు నడిపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వాహనాలను సీజ్ చేస్తున్నామని యాదాద్రి భువనగిరి జిల్లా రవాణా శాఖ అధికారి బి. సాయి కృష్ణ అన్నారు. "యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ఇంచార్జ్ (వాయిస్ టుడే ప్రతినిధి) మండవ శ్రీశైలం "తో గురువారం రోజు ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాహనాల స్పెషల్ చెకప్ చేస్తున్నామని, ఇందులో భాగంగా ఓవర్ లోడ్స్ తో వచ్చే వాహనాలు, సీసీ బస్సులు, ఎమర్జెన్సీ డోర్లు ఉండకుండా నిబంధనల విరుద్ధంగా ఉన్న వాహనాలను సీజ్ చేయడం, ఆర్టీసీ వాహనాలు నడిపే డ్రైవర్లకు, వాహనాలను నిత్యం చెకప్ చేసే మెకానికులకు, సంబంధిత కండక్టర్లకు ప్రభుత్వ నిబంధనల మేరకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి వారిని చైతన్య పరచడం జరుగుతుందన్నారు. ఆయా బస్సులలో ప్యాసింజర్ లగేజ్ కాకుండా అదనంగా లగేజ్ వేసుకున్న డ్రైవర్ల పై కేసు నమోదు చేయడం, ఫిట్నెస్ లేని ఏవి బండ్లను 601గుర్తించి అట్టి బండ్లను సీజ్ చేయడం, ఆ వాహనాల యజమాన్యాలపై ఫైన్ వేయడం జరిగిందన్నారు. తమ జిల్లా పరిధిలో ఎంవీఐలు 3గ్గురు, ఏ ఎం వీ ఐ లు 3గ్గురు, నవంబర్ నెలలో ఏఎంవిఐ కి 7 లక్షలు, ఎంవిఐ కి 4 లక్షలు, తనతో కలుపుకొని ప్రభుత్వానికి ఈ మేరకు టార్గెట్ రెవెన్యూ అందజేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి వాహనం చెక్ చేసుకుంటూ, టాక్సీ కనెక్షన్స్, కాంపౌండింగ్ ఫీజ్, గవర్నమెంట్ ఖాతాలో వేయడం జరుగిందన్నారు. ఇందులో భాగంగానే 2024 మార్చ్ నెల నుండి 2025 మార్చ్ వరకు ప్రభుత్వ ఖాతాలో వేసిన డబ్బుల వివరాలు ఇలా ఉన్నాయన్నారు. జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు తమ వాహనాలను పంపిణీ చేసేందుకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తన వంతు సాయం చేస్తానన్నారు. క్వార్టర్లీ టాక్స్ 2506.87, లైఫ్ టాక్స్ 4762.69, లైఫ్ టాక్స్ ఫీజ్,940.81, సర్వీస్ ఫీజు 244.12, డిటెక్షన్ 302.49, గ్రీన్ టాక్స్ 96.38, టోటల్ 8853.36 కోట్ల రూపాయలను వసూలు చేసి ప్రభుత్వ ఖాతాలో జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా చౌటుప్పల్లో ఫిట్నెస్ పాయింట్ను ఏర్పాటు చేసినట్లు, ఫస్ట్ జనవరి 2026 రోడ్ సేఫ్టీ వారోత్సవాలు సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్లకు, లారీ డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు, డీసీఎం, ఫోర్ వీలర్ డ్రైవర్లకు అందరికీ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, వారికి బ్లడ్ డొనేషన్ క్యాంపులు, హెల్త్ చెకప్ లు, ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులకు హెల్మెట్ లేని వారికి హెల్మెట్లు ఇవ్వడం జరుగుతుందని, వాహనదారులు సేఫ్టీ గా ఇంటికి వెళ్లేందుకు వారికి పలు అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు, ఈ యొక్క రోడ్డు సేఫ్టీ వారోత్సవాల క్యాంపులో ప్రతి ఒక్క డ్రైవర్ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు రైతుల ధాన్యంను మార్కెట్ కు తరలించేందుకు తాము వాహనాలను సమకూర్చినట్లు ఆయన వివరించారు. ప్రయాణికుల సౌకర్యం, డ్రైవర్ల సేఫ్టీ కోసం, ప్రజల సౌకర్యం కోసం తాను ఎల్లప్పుడూ మంచి కోరుకుంటానని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వాహనాల యజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా రవాణా శాఖ అధికారి బి.సాయి కృష్ణ పేర్కొన్నారు.

# నేడు గోపాల్ నగర్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

### కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



కూకట్ పల్లి, డిసెంబర్ 4(వాయిస్ టుడే): కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ నిరంతర కృషి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు డివిజన్ గోపాల్ నగర్ లో నేడు శుక్రవారం ఉ. 08:00 గం. లకు గోపాల్ నగర్ (కమాన్ వద్ద) బీటి రోడ్డు నిర్మాణానికి రూ. 80 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం చేయనున్నట్లు బండి రమేష్ తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొనవలసిందిగా కోరారు. గోపాల్ నగర్ ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించి ఒక్కొక్క సమస్య పరిష్కారం చేస్తున్నటువంటి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ కు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు గాదె శివ చౌదరి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మరియు గోపాల్ నగర్ కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# హిల్ట్ పాలసీ అమలు చేస్తే బీఆర్ఎస్ పార్టీ పెద్దఎత్తున ప్రజా ఆందోళనలు




వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : హైదరాబాద్ మహానగర ప్రాంతంలో HILTP పేరుతో రూ.5 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రను అడ్డుకునేందుకు, మాజీ మంత్రి హరీష్ రావు ఆదేశాల మేరకు పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రత్యేక పర్యటన నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పర్యటనలో ముఖ్య అతిథులుగా కరీంనగర్ మాజీమంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మనిక్‌రావు, %ణజమీూ% చైర్మన్ మల్కాపురం శివకుమార్, మాజీ బెవరేజెస్ చైర్మన్ దేవి ప్రసాద్, మాజీ ఎస్టీ%–%ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్ తదితర నేతలు పాల్గొన్నారు.

తమ చేతుల్లో "తెలంగాణను దోచుకుంటున్న దండుపాళ్యం ముఠా" అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ హిల్ట్ పాలసీ రద్దు చేయాలని బలంగా నినాదాలు చేశారు. పటాన్‌చెరు ప్రాంతంలో మొత్తం 1,188 ఎకరాలు, పాశమైలారం పారిశ్రామికవాడలో 1,495 ఎకరాలు, మొత్తం కలిపి 2,708 ఎకరాల పారిశ్రామిక భూములను HILTP పేరిట ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించాలనే ప్రయత్నం చేస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు ధ్వజమెత్తారు.

వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా హిల్ట్ పాలసీని తెచ్చిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద రియల్‌ఎస్టేట్ కుంభకోణమని పేర్కొన్నారు. పటాన్‌చెరు – పాశమైలారం పరిశ్రమలను తరలిస్తే వేలాది మంది కార్మికులు నిరుద్యోగులవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య రహిత పరిశ్రమలపైనా ప్రభుత్వం బలవంతపు తరలింపులకు సిద్ధమవుతోందని విమర్శించారు. హిల్ట్ పాలసీ అమలు చేస్తే బీఆర్ఎస్ పార్టీ పెద్దఎత్తున ప్రజా ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హిల్ట్ పాలసీపై పట్టుబడితే ఆదిలో రైతుల నుంచి రూ.3,000/ఎకరాకు కొనుగోలు చేసిన భూముల్లో కనీసం 50% రైతులకు తిరిగి ఇవ్వాలి. ఇంకా కోర్టుల్లో న్యాయం కోసం పోరాడుతున్న రైతులకు ప్రాధాన్యతతో పరిష్కారం ఇవ్వాలి.

లేకపోతే ఆ భూములను ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధి చేయాలి. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్,జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### రాజబోయిన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో

# ఘనంగా అయ్యప్ప స్వామి 18 వ మహా పడిపూజ

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పటాన్ చెరు పట్టణంలో రాజబోయిన కుమార్ యాదవ్ రాచబోయిన సంతోష్ యాదవ్ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి 18వ పడిపూజ ఘనంగ నిర్వహించారు, శ్రీ హరిహరన్ తాంత్రి గురుస్వామి కరకములముచే 18 కలశాల పూజ, ఈ 18వ పది నారీకేల పూజ నిర్వహించడం, గురు స్వామి చెప్పిన మూలమంత్రం, ఎప్పుడు మర్చిపోలేనిధి, ఇది నేను మా కుటుంబ సభ్యులు చేసుకున్న అదృష్టంగ భావిస్తున్నానని సంతోష్ యాదవ్ తెలిపారు, పెద్దపులి ఈశ్వర్, వడ్ల నగేష్ చారి బృందం భజన పాటలు భక్తి పారవశ్యాంలో ముంచేత్తాయి, వందలాదిమంది అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో ప్రాంగణమంతా ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప అని మారుమ్రోగింది, పూజ అనంతరం వారి కుటుంబ సభ్యుల స్వహస్తాలతో ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మహా పడిపూజకు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మారేడుపల్లి కిట్టు ఫహిల్మాన్, లడ్డు పహిల్మాన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, పలువురు హాజరయ్యి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ సందర్భంగ పూజ నిర్వహికుడు సంతోష్ యాదవ్ మాట్లాడుతూ ఆ హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి దీవెనలతో 18 వ పడి పూర్తి చేసుకోవడం చాలా ఆనందంగ ఉందని, అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని వేడుకున్నట్లు తెలిపారు. ఈ పూజ కార్యక్రమంలో రాజబోయిన కుటుంబ సభ్యులు వందలాదిమంది అయ్యప్ప స్వాములు, పుర ప్రముఖులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# స్వర్గీయ శ్రీ కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయం

### – టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్ పల్లి, డిసెంబర్ 4(వాయిస్ టుడే): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్ లో రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన టీపీసీసీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ ఉపాధ్యక్షులు టి. కుమార్ రావు, తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సాధారణ జీవనం, ఉన్నత ఆచరణతో రాష్ట్ర రాజకీయాలకు నాణ్యత తీసుకువచ్చిన రోశయ్య గారు ఆర్థిక క్రమశిక్షణ, ప్రజాహిత నిర్ణయాలు, నైతిక పాలనకు ప్రతీక. ఆయన నాయకత్వం, ప్రజల పట్ల ఉన్న ప్రేమ, పార్టీ పట్ల చూపిన అంకితభావం ఈ తరానికి కూడా మార్గదర్శకమే. నేడు ఆయనను స్మరించుకుంటూ, ప్రజాసేవ, బాధ్యతాయుత పాలన, నైతిక రాజకీయాలు అనే ఆయన చూపిన మార్గంలో కట్టుబడి ముందుకు సాగుతామన్నారు.

# డిసెంబర్ 10న చలో ఢిల్లీ

### బిసి జాతీయ ప్రధాన కార్యదర్శి ర్యాగ అరుణ్...
### ఢిల్లీలోని ఏఐసీసీ భవన్ ముట్టడికి పిలుపు....



సికింద్రాబాద్, డిసెంబర్ 04 (వాయిస్ టుడే ప్రతినిధి): బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్ల అమలు పై కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ ఈ నెల11 న ఢిల్లీ లో నీ ఏఐసీసీ భవన్ ముట్టడి కి బిసి జాతీయ ప్రధాన కార్యదర్శి ర్యాగ అరుణ్ బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం విద్యానగర్ బీసీ భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డిసెంబర్ 10 న చలో ఢిల్లీ, 11న ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ నిర్లక్ష్య వైఖరి గూర్చి కేంద్ర మంత్రులకు మెమొరండాలు సమర్పిస్తున్నామన్నారు. ఢిల్లీ వేదిక గా కాంగ్రెస్పై జరిగే ఈ యుద్ధంలో ప్రతి బీసీ వేలాది సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో కామారెడ్డి డిక్లరేషన్ అమలు అయ్యేంతవరకు పోరాటం చేయాలని పిలుపు ఈ కార్యక్రమంలో చెరుకుల రాజేందర్, శ్రీనివాస్, సిద్ధార్థ, బాలయ్య, బాలరాజ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.




# ఏబీవీపీ జాతీయ మహాసభలు విజయవంతం

### జాతీయ కార్యదర్శి శ్రావణ్ రాజ్...

సికింద్రాబాద్,డిసెంబరు04 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ లో నవంబర్ 28,29,30 తేదీలలో నిర్వహించిన ఏబీవీపీ 71 వ జాతీయ మహాసభలు విజయవంతం అయ్యాయని ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి రాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం తార్నాకలోని ఏబీవీపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ 76 లక్షల పైచిలుకు సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా మరొకసారి ఏబీవీపీ ఆవిర్భవించిందన్నారు.వచ్చే సంవత్సరం జరగబోయే ఏబీవీపీ 72 వ జాతీయ మహాసభలు తెలంగాణ రాజధాని హైదరాబాద్ లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ముగిసిన జాతీయ మహాసభల్లో అనేక అంశాలపై చర్చ జరిగిందన్నారు. ప్రధానంగా విద్య, జాతీయ భద్రత,సామాజిక అంశాలు,పర్యావరణం పై చర్చ జరిగినట్లు వివరించారు. దేశవ్యాప్తంగా భగవాన్ బిర్సా ముండా 150 జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్ర మాలను జాతీయ మహాసభల్లో ప్రస్తా వించడం జరిగిందన్నారు. రానున్న ఫిబ్రవరి నుండి దేశవ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వ ర్యంలో "హాస్టల్ సర్వే" నిర్వహించ బోతున్నామని దీని ద్వారా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు,వారి అవసరా లు, ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు మాట్లాడుతూ "అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వానికి ఒక నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని, విద్యా రం గానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం విద్యార్థి సమాజం ముందు ఉంచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సమాజంలో దోషిగా నిలబెడుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యసమితి సభ్యులు మదూరి. సందీప్ రావు, మహానగర కార్యదర్శి పృథ్వీ తేజ, రాష్ట్ర ఈ సభ్యురాలు అక్షిత పాల్గొన్నారు.

# సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు-2025పై రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రసంగం



రాజ్యసభలో గురువారం జరిగిన సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు-2025పై జరిగిన చర్చలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పదేళ్లపాటు చేసిన పరిపాలన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా నడిపి, దేశ ఆర్థిక పురోగతికి విశేషంగా తోడ్పడిందని పేర్కొన్నారు. సామాజిక కోణంలో కాకుండా ఆర్థిక, పారిశ్రామిక అంశాలకు సంబంధించిన ఈ బిల్లుకు తమ పార్టీ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.

తెలంగాణలో గౌడ కులస్తుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం మద్యం దుకాణాల కేటాయింపుల్లో 15% రిజర్వేషన్లు అమలు చేయడం ముఖ్యమైన సంస్కరణగా వివరించారు. మద్యం విక్రయాలపై సరైన పర్యవేక్షణ, తనిఖీలు, నియంత్రణ లోపించడం వల్ల బ్లాక్ మార్కెట్, కల్తీ మద్యం, బెల్ట్ షాపులు విస్తరిస్తున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని ఎంపీ రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా మహిళలు, పిల్లలు తీవ్ర మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. అక్రమ రవాణా, కల్తీ మద్యం నియంత్రణకు కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాల సంబంధిత శాఖలు సమన్వయం పెంచాలని ఆయన సూచించారు. అలాగే బీడీ కార్మికులు నోటి క్యాన్సర్ బారిన పడుతున్న సమస్యను ఉటంకిస్తూ, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం వంటి ఉమ్మడి జిల్లాల్లో వేలాది కుటుంబాలు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. ఈ సమస్యపై కేంద్రం ముందస్తు చర్యలు తీసుకొని ప్రజల్లో వ్యసనాల నివారణకు అవసరమైన అవగాహన, చర్యలను చేపట్టాలని కోరారు. సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు%-%2025కు బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర భేటీ



బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర గురువారం సాయంత్రం పార్లమెంట్ ప్రాంగణంలోని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రధాన రహదారుల విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని కోరుతూ ఎంపీ రవిచంద్ర వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా జాతీయ రహదారుల విస్తరణకు ప్రత్యేక దృష్టి సారించాలని, ఇప్పటికే ప్రతిపాదిత ప్రాజెక్టులకు ఆమోదాలు, నిధులు త్వరితగతిన విడుదల చేయాలని ఆయన మంత్రి గడ్కరీని అభ్యర్థించారు. మంత్రి గడ్కరీ వినతిని సానుకూలంగా పరిశీలిస్తామంటూ స్పందించినట్టు సమాచారం.



## మాజీ సీఎం రోశయ్య వర్ధంతి

### నివాళులు అర్పించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 4: రాజన్న సిరిసిల్ల జిల్లా లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతి ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అండ్ క్రీడల శాఖ అధికారి రాందాస్, ఏవో రాంరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కేసీఆర్ తెలంగాణకు రక్ష

### మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, వాయిస్ టుడే: బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణకు రక్ష అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ శాసనసభ్యులు,బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. గురువారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వేద పండితులు రాకేష్ శర్మ మరియు ఇతర వేద పండితుల మంత్రోచ్ఛరణలతో రుద్ర మహా మృత్యుంజయ హెూమాన్ని శాస్త్రోక్తతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ నేత కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో,సంతోషంగా, బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు మరింత అండగా ఉండేందుకు దేవుళ్ళ ఆశీస్సులు ఉండాలని సర్వమత ప్రార్ధనలు గురువారం నిర్వహించారు. అనంతరం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ 11 రోజుల కార్యక్రమాల్లో భాగంగా 6వ రోజైన గురువారం పార్టీ కార్యాలయంలో కేసీఆర్ కు ఆ భగవంతుడు మరింత శక్తినివ్వాలని,ప్రజలకు వారు మళ్లీ ముఖ్యమంత్రిగా సేవలందించాలని ప్రార్థిస్తూ పూజా కార్యక్రమాలు, హెూమం నిర్వహించారు. అమరుల త్యాగాలు ఉద్యమకారుల పోరాటాన్ని నేటి విద్యార్థులకు,రానున్న తరానికి తెలిపేందుకే 11 రోజుల పాటు కేసీఆర్ దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వినయ్ భాస్కర్ తెలిపారు. ఈ రోజు దీక్షా దివస్ లో భాగంగా 7వ రోజున బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి,మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి,కార్పొరేటర్ సంకు నర్సింగ రావు,సోదా కిరణ్,మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీ నారాయణ,ఉడతల సారంగపాణి,నాయకులు నరెడ్ల శ్రీధర్,నార్లగిరి రమేష్, పులిరజినీకాంత్, దూలంవెంకన్న, నయీమొద్దీన్, చంద్రమోహన్, సదాంత్, శ్రీధర్,చందర్,రమేష్,ఖలీల్,విక్రమ్,శ్రీధర్ రావు, దేవమ్మ, లలిత, శ్రీకాంత్ చారి,గౌస్,రంజిత్,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు బోయినపల్లి యువకుడు



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి డిసెంబర్ 4: బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన గుంటి శ్రీకాంత్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయినట్టు రాజన్న సిరిసిల్ల కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముస్కు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగారపు తిరుపతి ఒక ప్రకటన లో తెలిపారు. 51 వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు ఈ నెల 5 నుండి 7వ తారీకు వరకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లో జరిగే పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా తరుపున పాల్గొంటాడు అని తెలిపారు. గుంటి శ్రీకాంత్ ఎంపిక పట్ల బోయినపల్లి గ్రామ ప్రజలు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేసారు. భవిష్యత్ లో మరింతగా రాణించాలని కోరుకున్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత

### సీపీ గౌష్ ఆలం పర్యవేక్షణ

### నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్ల పరిశీలన





జమ్మికుంట డిసెంబర్ 4 (వాయిస్ టుడే): కరీంనగర్ జిల్లాలో మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా, మూడవ విడత నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద మరియు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను సీపీ గురువారంనాడు స్వయంగా పర్యవేక్షించారు.

**భద్రతా ఏర్పాట్లు**

మూడవ విడత ఎన్నికలు జరగనున్న వీణవంక, జమ్మికుంట, హుజురాబాద్, ఇల్లందుకుంట, సైదాపూర్ మండలాల్లో నిన్నటి నుండి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ గౌష్ ఆలం తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు ఏర్పాట్లను ఆయన తనిఖీ చేశారు.

**సమస్యాత్మక కేంద్రాల పరిశీలన**

ఎన్నికలు సజావుగా సాగేందుకు వీలుగా, సీపీ పలు సమస్యాత్మక (Trouble Spots) పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. వీణవంక మండలంలోని చల్లూరు, మామిడాలపల్లిబీ జమ్మికుంట పరిధిలోని జగ్గయ్యపేట, వల్భాపూర్బీ ఇల్లందుకుంట మండలంలోని నాగంపేట, టేకుర్తిబీ హుజురాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి, చిన్నపాపయ్యపల్లి వంటి పలు గ్రామాల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ రోజు ఈ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించి, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

**రౌడీషీటర్లకు సీపీ హెచ్చరిక**

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు: ఎన్నికల నేపథ్యంలో పలువురు రౌడీషీటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి సీపీ గౌష్ ఆలం హెచ్చరించారు. ఎన్నికల్లో ఎటువంటి శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**బైండోవర్ చర్యలు:** ఎన్నికల నియమావళి (Model Code of Conduct) అమల్లోకి వచ్చినందున, గతంలో నేర చరిత్ర ఉన్న ఎన్నికల నేరస్థులను బైండోవర్ చేస్తున్నట్లు సీపీ తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలు కవర్ అయ్యేలా సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని అధికారులకు సీపీ సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పర్యవేక్షణలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, కరుణాకర్, రామకృష్ణ, ఎస్సైలు ఆవుల తిరుపతి, క్రాంతికుమార్ లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఓయూకు ముఖ్యమంత్రి రాకను స్వాగతిస్తున్నాం

### టీపీసీసీ అధికార ప్రతినిధి చినగాని దయాకర్

సికింద్రాబాద్,డిసెంబర్ 04 (వాయిస్ టుడే ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 7న ఓయూకు రావడాన్ని తాము స్వాగతిస్తున్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. ఈ మేరకు ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీని గత ప్రభుత్వం నిర్లక్ష్యం తో నిధులివ్వకుండా, నియామకాలు చేపట్టకుండా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ కి ఏ ముఖ్యమంత్రి రెండు సార్లు వచ్చిన చరిత్ర లేదన్నారు. కానీ ప్రజాపాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండోసారి ఓయూకు రావడం జరుగుతుంది దీన్ని ఓయూ అధికారులు, విద్యార్థులు, ఉద్యోగు లు అందరూ స్వాగతించాలని తెలిపారు. ముఖ్యమంత్రి రాకతో విద్యార్థుల, ఉద్యోగు ల సమస్యలు తెలుసుకొని ఓయూ దశ, దిశ మార్చి మరో వంద సంవత్సరాలు ప్రపంచానికే ఒక ఐకాన్ లాగా, ప్రపంచ యూనివర్సిటీలతో పోటీపడే విధంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఆలోచనను ఓయూ విద్యార్థి లోకం ,అధ్యాపక లోకం స్వాగతిస్తుంది అన్నారు. గత పాలకులు వేలకోట్ల ప్రజాధనాన్ని దుర్వి నియో గం చేశారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చిన తర్వా త ప్రతి పైసా తెలంగాణ భవిష్యత్తుకు, విద్యార్థులకు ఉపయోగిస్తున్నారన్నారు. ముఖ్య మంత్రి రాకను విద్యార్థులు, మేధావులు ఉద్యోగులు అందరూ స్వాగతించాలని కోరారు.

## గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలి

### ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్య చర్యలు

### యాదాద్రి భువనగిరి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆకాంక్ష యాదవ్



యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాలు..427 గ్రామ పంచాయతీలకు..మూడు విడతలుగా జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు... యాదాద్రి భువనగిరి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) ఆకాంక్ష యాదవ్ యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... (వాయిస్ టుడే ప్రతినిధి) :- గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని,ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి వారి పైన నైనా చట్టరిత్య చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) ఆకాంక్ష యాదవ్ అన్నారు. "యాదాద్రి భువనగిరి జిల్లా (వాయిస్ టుడే బ్యూరో) మండవ శ్రీశైలం తో" గురువారం రోజు ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో మూడు విడుతలుగా జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, పోలీసులకు సహకరించాలని ఆయన వివరించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాలలో 427 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, వాటికి జరిగే ఎన్నికలు మూడు ఫేసులలో జరుగుతాయని ఫస్ట్ ఫేస్ డిసెంబర్ 11, సెకండ్ ఫేస్ 14, థర్డ్ ఫేస్ డిసెంబర్ 17 న జరుగుతాయని అదే రోజు కౌంటింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు. ఫస్ట్ ఫేస్ లో జరిగే 153 గ్రామపంచాయతీల ఎన్నికలకు 1500 మంది పోలీసులు,సెకండ్ పేస్ లో జరిగే 150 గ్రామపంచాయతీలకు 1500 మంది పోలీసులు, థర్డ్ ఫేస్ లో జరిగే 124 గ్రామ పంచాయతీలకు 1000 మంది పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇదే కాకుండా మొబైల్ పోలీస్ వ్యాన్లు,పెట్రోలింగ్ పోలీసు వాన్లు, పోర్టరోటి మొబైల్, విల్లా పిక్, (ఎఫ్ ఎస్ టి) ఫైన్ స్కాడ్ టీం, ప్రతి మండలానికి ఒకటి, ఎస్ ఎస్ టి 4 టీములు, నాలుగు చెక్పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇదే కాకుండా 400 మంది స్టేట్ బెటాలియన్, ఏఆర్ పోలీసులు కూడా బందోబస్తులో పాల్గొంటున్నారన్నారు. ఎన్నికల నేపథ్యంలో 248 మందిని ఇతర కేసులు ఉన్నవారిని , రౌడీ షీటర్లను బైండోవర్ చేసినట్లు ఆయన వివరించారు. అక్రమ మద్యం రవాణా చేస్తూ, అక్రమంగా మద్యం అమ్ముతున్న 80 మంది పై తమ పోలీసులు కేసు నమోదు చేశారని, 756 లీటర్ల మద్యాన్ని తమ సిబ్బంది సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలు 219 గుర్తించామని, అక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల సమయంలో నిత్యం పోలీసులు గస్తీలు తిరుగుతారని, క్షణ క్షణం పోలీసు నిఘా ఉంటుందని,ఎన్నికలు జరిగే ప్రాంతంలో 144 సెక్షన్ నిబంధనలో ఉంటుందని, దానిని అతిక్రమించి ఎవరు రాకూడదని ఆయా రాజకీయ పార్టీల నాయకులకు ఆయన వివరించారు. అదేవిధంగా రాజకీయ నాయకులు, మద్యం, డబ్బులు పంపకం చేసి ప్రజలను మభ్యపెడితే, పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారిపై కఠిన చర్యలు ఉంటాయని, లా అండ్ ఆర్డర్ కు ఆటంకము జరిగితే ఎంతటి వారి పైన అయినా సరే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన ఆయా రాజకీయ పార్టీల నాయకులకు, ప్రజలకు హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా జరుపుకునేందుకు ఆయా రాజకీయ పార్టీల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆకాంక్ష యాదవ్ పేర్కొన్నారు.

## దళిత కాలనీలో పూర్తవుతున్న ఇందిరమ్మ ఇండ్లు

### సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులుబీ ఇందిరమ్మ ఇళ్ల



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వారి ఇల్లు పూర్తి అవ్వడంతో,సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి దారుడు కొంపెల్లి ఎల్లయ్య, ఉపేందర్, శైలజ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఎన్నో దరఖాస్తులు చేసుకున్న, లాభం లేకుండా పోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, సన్న బియ్యం, మా మహిళలకు ఉచిత బస్సు, 500 ఉచిత సిలిండర్, ఉచిత కరెంటు, లబ్ధి పొందుతున్నాను. ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు ద్వారా నా సొంత ఇంటి కల నెరవేరిందని అన్నారు. నా ఇంటి నిర్మాణానికి సహకరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్,26 వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రెడ్డిమల్ల భాను, కాంగ్రెస్ పార్టీ జిల్లా, పట్టణ నాయకులకు, కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎం శంకుస్థాపన చేసిన పనులు ఆరు నెలల్లో పూర్తి చేసే దమ్ముందా...?




## మద్యం అమ్మకాల పై నియంత్రణ విధించాలి

**బెల్ట్ షాపులను పూర్తిగా మూసి వేయాలి**

**నిబంధనలు అతిక్రమిస్తున్న పర్మిట్ రూములపై చర్యలు తీసుకోవాలి.**

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 4: రాష్ట్ర ప్రభుత్వం,గత ప్రభుత్వం మాదిరిగానే తన ప్రభుత్వ నడుపుటకు మద్యం ఆదాయం పై నే ఆధారపడి మద్యం టెండర్లు ముందుగానే జరిపి విచ్చల విడిగా మద్యం అమ్మకాలు కొనసాగించడానికి గ్రామాల్లో అనేక బెల్ట్ షాపులు ఉన్న వైన్ షాపుల కు అనుబంధంగా పర్మిట్ రూములు నిబంధనలు పాటించక పోయినా కేవలం ఆదాయం పెంచుకోవడానికి మాత్రమే ప్రయత్నిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏర్పడిన మొదటి ప్రభుత్వం చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో 9 సంవత్సరాలు పరిపాలన కొనసాగించి సామాన్య ప్రజలకు అందు బాటులోని కి అని చెప్పి చీప్ లిక్కర్ను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని తాగుబోతుల రాష్ట్రంగా తీర్చిదిద్దినాడు. ప్రజలు ఇంకే సమస్యలు ప్రస్తావించకుండా గ్రామ గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నడుస్తున్న పట్టించుకోకుండా కేవలం మద్యం పై వచ్చే ఆదాయం కోసమే విచ్చల విడిగా మద్యం అమ్మకాలకు ప్రోత్సహించి నాడు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మేము అధికారంలోకి రాగానే గ్రామాల్లో ఉన్న అన్ని బెల్ట్ షాపులను మూసి వేస్తాం. మద్యంపై నియంత్రణ కొనసాగిస్తాం, మద్యం పై వచ్చే ఆదాయం పై ప్రభుత్వాన్ని నడపాలని చూడం అని సత్య పూస మాటలు పలికిన కాంగ్రెస్ నాయకులు వైన్స్ ఫీజు గత ప్రభుత్వం రెండు లక్షలు ఉంటే ఇప్పుడు దాన్ని 3 లక్షలకు చేసి ముందుగానే టెండర్లు నిర్వహించి, మద్యం, వ్యాపారం కొనసాగిస్తున్నారు. గ్రామ గ్రామాన వాడ వాడల బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నడుస్తున్న కళ్ళు మూసుకొని పరిపాలన కొనసాగిస్తూ ఉన్నారు . వైన్ షాపులకు అనుబంధంగా ఉన్న పర్మిట్ రూము లు నిబంధనలు పాటించక పోయినా పట్టించుకునే నాధుడు లేడు. వైన్ షాపు ల నుండి విచ్చలవిడిగా బెల్ట్ షాపులకు మద్యం నిత్యం సరఫరా అవుతుంది. పర్మిట్ రూముల లో కుర్చీలు బెంచీలు వేసి నాన్ వెజ్ ఆహార పదార్థాలు నమ్ముతూ సామాన్యులను పర్మిట్ రూముల కే పరిమితం, అయ్యే విధంగా వ్యాపారులు ఆకర్షిస్తూ ఉన్నారు. మద్యానికి బానిసైనా సామాన్య ప్రజలు ఇల్లు గుల్ల చేసుకుంటూ తమ సంసారాల ను వీధిన పడేసు కుంటూ అప్పులపాలై అనారోగ్య సమస్యల పాలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు ఇప్పటి కైనా పాలక ప్రభుత్వం తన మద్యం పాలసీని మార్చుకొని బెల్ట్ షాపుల ను రద్దుచేసి పర్మిట్ రూముల పైనిగా ఉంచి ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే వైన్స్ ల పై కఠిన చర్యలు ఉండాలని హెచ్చ రిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్టీ యు న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సోమిశెట్టి దశరథం, గుజ్జ దేవదాస్, ఆకిన సత్తయ్య, ద్యా నపల్లి ఎల్లయ్య, రాజేషం పాల్గొన్నారు.




## ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించాలి

**మాల మహానాడు రాష్ట్ర నాయకులు**

**కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు రిజర్వేషన్ల గురించి మాట్లాడకపోవడం బాధాకరం**

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 4: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా లో మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆ పార్టీ లో ఉన్న మాల మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపీలు,ఎమ్మెల్సీలు, వర్గీకరణ జరిగేటప్పుడు మాల సామాజిక వర్గానికి రావలసిన శాతం రిజర్వేషన్ అడగక పోవడం వల్ల,మాల సామాజిక వర్గం రిజర్వేషన్ కోల్పోయిందని అన్నారు.ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించాలని, రెండు శాతం అదనంగా రిజర్వేషన్ ఇవ్వాలని, 20 లోపు రెండు రోస్టర్ పాయింట్స్ కేటాయించాలని,ఇది ఆ సామాజిక వర్గాల నుంచి ఎదిగిన రాజకీయ నాయకుల బాధ్యత అని గుర్తు చేశారు, లేకపోతే మాల సామాజిక వర్గం వారి పదవులు వదులుకోవాలని అన్నారు.మాలల కు రిజర్వేషన్ లేకుండా చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కి వ్యతిరేకంగా పని చేయాలని మాలల కు పిలుపు ఇచ్చారు. గ్రామ పునాదుల వరకు,జేఏసీ నిర్మాణం చేయాలని,మనకు రావలసిన%శీ%టు వంటి న్యాయమైన వాటా కొరకు,ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని,విద్యార్థులకు యువకులకు, ఉద్యోగస్తులకు, మాల ప్రజల కి పిలుపు ఇచ్చారు. హక్కుల కై బిక్ష మెత కండి పోరాడి సాధించుకో మని చెప్పిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచన విధానంతో,భాగ్యరెడ్డి వర్మ ఉద్యమ స్ఫూర్తితో, పనిచేసి రిజర్వేషన్లు సాధించుకునేంతవరకు మడమ తిప్పని పోరాటం చేయాలని మాల ప్రజలకి పేరు పేరునా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మందాల భాస్కర్ తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్.చెరుకు రామ్ చందర్, గౌరవ అధ్యక్షుడు. బేరా బాలకిషన్ గ్రేటర్ చైర్మన్ , తుమ్మ శ్రీనివాస్ వైస్ చైర్మన్ , మాదాసి రాహుల్, స్టూడెంట్ జేఏసీ చైర్మన్, ఓయూ జేఏసీ చైర్మన్ బత్తుల రమేష్. తుంగశివరాజ్, జక్కుల యాదగిరి, పాటి రాజ్ కుమార్, పండుగ రవిశేఖర్, స్థానిక మాల మహానాడు నాయకులు, పాల్గొన్నారు.

## ఆర్కేపి పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



రామకృష్ణాపూర్, డిసెంబర్ 4 (వాయిస్ టుడే): రామకృష్ణాపూర్ ఆర్కే-4 గడ్డలో ఉన్న బేరాక్ ప్రార్థన మందిరంలో ఆర్కేపి పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ భరత్, పాస్టర్ టీ. కీర్తి కుమార్ హాజరయ్యారు. అతిథులు వాక్య బోధనలో మాట్లాడుతూ, యేసు క్రీస్తు ప్రేమకు ప్రతిరూపమని, ఆయన ప్రేమతో ప్రపంచాన్ని జయించాడని పేర్కొన్నారు. ఆయన చూపిన ఆదర్శాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. ప్రేమ, స్నేహభావం, మానవత్వం వంటి విలువలను పాటిస్తూ కులమతాలకు అతీతంగా సమాజంలో ఐక్యతను పెంపొందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్యాలు, క్రిస్మస్ పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమం మొత్తం క్రిస్మస్ ఉత్సాహంతో నిండిపోయింది. సంఘంలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకుంటూ ఆనందంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపి పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ప్రెసిడెంట్ టి. ప్రభుదాస్, వైస్ ప్రెసిడెంట్ భీమా సామిల్, సెక్రటరీ టీ. జాషువా, ట్రెజరర్ బి. రవి రఫుఎల్, జాయింట్ సెక్రెటరీ రమేష్ పాల్ తీసుకువచ్చారు. అడ్వైజర్లు పద్మారావు, ప్రవీణ్, దయాకర్, రమేష్ మార్క్ తదితరులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్ లో సీఎం పర్యటనతో ఒరిగిందేమీ లేదు?**

**గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని అడుగడుగునా అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ**

**హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్**



వాయిస్ టుడే ప్రతినిధి డిసెంబర్ 5 హుస్నాబాద్ ప్రతినిధి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ఈరోజు టిఆర్ఎస్ ఆఫీసులో మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ నేను చేసిన అభివృద్ధి పనులను ప్రారంభోత్సవాలు చేస్తున్నారే తప్ప ఒక్క అభివృద్ధి కార్యక్రమం ప్రారంభించలేదని అభివృద్ధి కేవలం కాగితాలకు మాత్రమే పరిమితం అవుతుందని ఈ రెండు సంవత్సరాలలో ఏం అభివృద్ధి చేశారు పొన్నం ప్రభాకర్ చెప్పాలని తెలియజేశారు మరియు పదేళ్లలో 96% రిజర్వాయర్ ను పూర్తి చేసి అందులో ఒకటి ఎం సి వరకు నీళ్లు నింపిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే కుర్చీ వేసుకుని గౌరవెల్లి ని పూర్తి చేస్తానని చెప్పి మాట నిలబెట్టుకున్న ఘనత కెసిఆర్ ది రిజర్వాయర్ కాలువల భూసేకరణ, నిర్మాణానికి సంబంధించి కూడా టిఆర్ఎస్ ప్రభుత్వం రూ 200 కోట్లు కేటాయించిన విషయం మర్చిపోవద్దు. కాలువలకు రూ437 కోట్ల రూపాయలు కేటాయించినట్లు చెప్పుకోవడం తప్ప ఇప్పటివరకు కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేకపోయారు.

**రెండేళ్లలో మీరేం చేశారనేది ఆలోచించుకోండి**

పిసిసి అధ్యక్షుడి హోదాలో ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా గండిపల్లిని సందర్శించి అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్లు గడిచిన గండిపల్లి ఊసు కూడా ఎత్తడం లేదు. 2014 ముందు హుస్నాబాద్ పట్టణం ఎలా ఉండేది అనంతరం ఎలా మారింది అనేది ఇక్కడ ప్రజలందరికీ తెలుసు... ఇక్కడ ఎలాంటి అభివృద్ధి జరగలేదనడం సీఎం, మంత్రి విజ్ఞతకే వదిలేస్తున్నా

ఎలాంటి అభివృద్ధి జరగందే హుస్నాబాద్ పట్టణానికి పలుమార్లు జాతీయ అవార్డులు వచ్చాయా

హుస్నాబాద్ నియోజకవర్గం లో చిన్న నీటి వనరులను అభివృద్ధి చేసిన ఘనత మాకే దక్కుతుంది మహాసముద్రం గండి, గాడుదులలొద్ది నిర్మాణం చేసింది మేమే... శనిగరం ప్రాజెక్టు, చెరువులు కుంటల మరమ్మత్తులు ఎవరు చేశారు చెప్పాలి. ఇది అభివృద్ధి కిందికి రాదా...

కేవలం ఒక కళాశాలకు అనుమతులు తెచ్చి హుస్నాబాద్ కు ఎంతో చేశామని చెప్పడం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.

కోట్ల రూపాయలు మంజూరు చేసామని చెప్పడం తప్ప పనులు పూర్తి చేసి చూపించిన దాఖలాలు ఎక్కడైనా కనిపించాయా. స్థానిక మంత్రిది మాటలు ఎక్కువ పనులు తక్కువ అనే చందంగా ఉన్నది హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థంగా సేవలందించడంతోపాటు సాధ్యమైనంత అభివృద్ధి చేశాము తప్ప ఎన్నడు కూడా కమిషన్లకు కక్కుర్తి పడలేదు దమ్ముంటే ఆరు నెలల్లో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన పనులన్నీ పూర్తి చేసి చూపించాలి అప్పుడు ప్రజలు నమ్ముతారు తప్ప ఇప్పుడు వచ్చి సభలు పెట్టి ఎన్ని ఊకదంపుడు ముచ్చట్లు చెప్పిన ఇక్కడి ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు 6 గ్యారంటీలను అమలు చేయలేక 420 హామీలను నెరవేర్చలేక గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓడిపోతామని భయంతోనే ముఖ్యమంత్రి జిల్లా పర్యటన చేస్తూ బహిరంగ సభలు పెడుతున్నాడు. సర్పంచ్ ఎన్నికల్లో లబ్ధి కోసమే తప్ప సీఎం బహిరంగ సభలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదు. కమిషన్ల కోసమే పక్కాగా ఉన్న దవాఖాన భవనాన్ని కూల్చివేశారు. చిత్తశుద్ధి ఉంటే కొత్త భవనాన్ని మరోచోట విశాలమైన స్థలంలో నిర్మించవచ్చు కదా తొమ్మిదిన్నర ఏండ్ల టిఆర్ఎస్ పాలనలో రూ 5649 కోట్ల అభివృద్ధి రూ 3427 కోట్ల సంక్షేమాన్ని అందించిన ఘనతమాదే గౌరవెల్లి భూనిర్వాసితులను రెచ్చగొట్టి ఎకరాకు రూ.30 లక్షల పరిహారం ఇప్పిస్తామని చెప్పిన పొన్నం ప్రభాకర్ ఇప్పుడు కేవలం రూ.15 లక్షలు ఇస్తామనడం హాస్యాస్పంతంగా ఉందన్నారు. స్థానిక మంత్రి ఉన్నం ప్రభాకర్ ఇప్పటికైనా తన తీరును మార్చుకోవాలని కేవలం సంపాదన ధ్యేయంగా పనిచేయకుండా సేవా దృక్పథంతో ప్రజలకు సేవలందించాలని హితవు పలికారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి సుద్దాల చంద్రయ్య టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మదన్మోహన్ రెడ్డి మాజీ కౌన్సిలర్లు భోజు రమా రవీందర్ భాగ్యరెడ్డి బొల్లి శ్రీనివాస్ ప్రభాకర్ రెడ్డి బొజ్జ హరీష్ వాళసుప్రజా నవీన్ రావ్ మాజీ జెడ్పిటిసి భూక్యమంగా మాజీ సర్పంచులు ఎంపీటీసీలు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు




## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 4: కొత్తగూడెం మండలం అని శెట్టిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఆకస్మికంగా సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. నామ పత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, వీడియోగ్రఫీ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చెయ్యాలని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ సెంటర్స్, చెక్ పోస్టులు ఆకస్మిక తనిఖీ

**పెద్దమ్మ, వెంకట్రావుపల్లి చెక్ పోస్ట్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 4: రాజన్న సిరిసిల్ల జిల్లా లో గ్రామపంచాయితీ ఎన్నికల సందర్భంగా ఎల్లారెడ్డిపేట,ముస్తాబాద్ మండలం లో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్స్ తో పాటు గా పెద్దమ్మ , వెంకట్రావుపల్లి చెక్ పోస్ట్లను ఆకస్మికంగా తనిఖీ చేసి విధుల్లో ఉన్న సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే గ్రామ పంచాయతీలకు, వార్డులకు మూడవ విడత నామినేషన్ ప్రక్రియ ప్రారంభ కావడం జరిగిందని , నామినేషన్ ప్రక్రియకు అనుగుణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లును చేయడం జరిగిందన్నారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షణ కొనసాగిస్తు అక్రమ మద్యం, డబ్బు రవాణాలను అడ్డుకునేందుకు ప్రతీ వాహనాన్ని చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతుందని, దీనిలో భాగంగా పోలీస్ సిబ్బంది గ్రామాలను తరచూ సందర్శిస్తూ ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నమని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లగించిన వారిపై ఇప్పటికే ఒక కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి బెల్ట్‌షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించగా, 20 కేసుల్లో 209 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 158 కేసుల్లో 657 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎస్పీ వెంట సి.ఐ లు శ్రీనివాస్, మొగిలి,ఎస్.ఐ లు గణేష్, అనిల్ సిబ్బంది ఉన్నారు.

## రేషన్ షాపులలో సన్న బియ్యంలో నూకలు

**అధికారుల పై బిజెపి నాయకుల విమర్శలు**

**రైస్ మిల్లులలో అక్రమాలు జరుగుతున్నవి.. తనిఖీలు నిర్వహించాలి: జిల్లా కలెక్టర్**



రాజన్న సిరిసిల్ల జిల్లాబీ డిసెంబర్ 4బీ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రేషన్ షాపులలో ఈనెల ప్రభుత్వ మిచ్చిన సన్న బియ్యం లో 40% నూకలు వచ్చాయి. దీని పై జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉన్నది. రైస్ మిల్లర్ దగ్గర గోల్ మాల్ జరిగిందా, కాంగ్రెస్ పెద్దలకు తెలిసి ఈ వ్యవహారం నడుస్తుందా. సన్న బియ్యం విషయంలో ప్రభుత్వ పెద్దలు ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని రేషన్ షాపులలో కాంగ్రెస్ నాయకులు ఒక్కసారి తనిఖీ నిర్వహించండి, అని పిలుపునిచ్చారు, వచ్చే నెలలోనైనా నిరుపేదలకు అందించే సన్న బియ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. అని బిజెపి సీనియర్ నాయకులు కొంపెల్లి విజయ్ కుమార్, శేఖర్, వివేకానంద, రమేష్, శంకర్, మాధవ్, ఉపేందర్ అన్నారు.

## సిఎంపిఎఫ్ పెన్షనర్లు సిపిఆర్ఎంఎస్ కార్డుదారులు రెన్యూవల్ కొరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలి



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 4 : సింగరేణి సంస్థలో పని చేసి పదవీవిరమణ పొంది పెన్షన్ పొందే సిపిఆర్ఎంఎస్ స్కీమ్ ద్వారా హెల్త్ కార్డ్ పొందిన ఉద్యోగులకు తెలియజేయునది ఏమనగా 2026 సంవత్సరానికి గాను సిఎంపిఎఫ్ పెన్షన్ పొందుటకు సిపిఆర్ఎంఎస్ హెల్త్ కార్డ్ రెన్యువల్ కొరకు ప్రతీ సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా నవంబర్ నెలలో లైఫ్ సర్టిఫికెట్ ను సమర్పించాలి. కానీ ఇప్పటివరకు చాలా మంది మాజీ ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్ ను సమర్పించలేదు. ఇప్పటివరకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించని సింగరేణి మాజీ ఉద్యోగులు తమ మొబైల్ ఫోన్ లోని జీవన్ ప్రమాన్ ఫర్ లైఫ్ సర్టిఫికెట్ ఆధార్ ఫేస్ ఐడి ఆండ్రాయిడ్ అప్లికేషన్ల ద్వారా లేదా స్వయంగా సిఎంపిఎఫ్/ సిపిఆర్ఎంఎస్ డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలని లేదా దగ్గరలోని మీసేవా కేంద్రం వద్దనైనా సమర్పించి నిరాటంకమైన పెన్షన్ వైద్య సేవలు పొందవలసినదిగా జిఎం(పర్సనల్) వెల్ఫేర్ %ు% సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ పత్రికా ప్రకటనలో భాగముగా తెలియజేశారు.

## ఝరాసంగం నుండి శబరిమలకు రాము అయ్యప్పగురు స్వామీ

వాయిస్ టుడే ఝరాసంగం డిసెంబర్04: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల్ ఝరాసంగం గ్రామానికి చెందిన రాము అయ్యా ప్ప గురుస్వామి అయ్యప్ప స్వాముల బృందంతో ఇరుమూడి తీసుకోని శబరిమలకు బయలుదేరారు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మిత్రులు.సిహెచ్. సంగయ్య. నర్సప్ప.సీను.నగరాజ్. సిహెచ్ దత్తు. శుభాకాంక్షలు తెలిపారు...

